

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక
# ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 16 | శనివారం 18, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## వీగిపోయిన 131వ
# రాజ్యాంగ సవరణ బిల్లు

న్యూఢిల్లీ ఏప్రిల్ 17 (ప్రజా సీమ) :కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో అనూహ్యమైన ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో వీగిపోయింది. బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓడిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ కీలక బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో హాజరైన వారిలో మూడింట రెండొంతుల మంది, అంటే 352 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే, ప్రభుత్వం ఈ మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోవడంలో విఫలమైంది. రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిన వెంటనే,



పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక ప్రకటన చేశారు. ఈ బిల్లుతో అనుబంధంగా ఉన్న 'డీలిమిటేషన్ బిల్లు, 2026', 'కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026'లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటున్నట్లు సభకు తెలిపారు.

## నేడు కేంద్ర కేబినెట్
# అత్యవసర సమావేశం

● మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ



న్యూఢిల్లీ ఏప్రిల్ 17(ప్రజా సీమ): శనివారం జరగనున్న కేంద్ర కేబినెట్‌హా అత్యవసర భేటీ జరగనుంది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఉదయం 11:30 గంటలకు కేంద్ర మంత్రిమండలి సమావేశం కానుంది. ఈసారి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా 'అత్యవసర' భేటీ కావడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. ప్రభుత్వం అధికారికంగా అజెండాను వెల్లడించనప్పటికీ, విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇరాన్ తన అధీనంలోని హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచిన నేపథ్యంలో, ప్రపంచ ఇంధన మార్కెట్లో మార్పులు వచ్చే అవకాశం ఉ ంది. చమురు సరఫరా పునరుద్ధరణ నేపథ్యంలో భారత్ వంటి దిగుమతి చేసుకునే దేశాలకు కలిగే ఆర్థిక వెసులుబాటుపై చర్చించనున్నారు. పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా భారత విదేశాంగ, వాణిజ్య విధానాలపై నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉంది. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేసేందుకు, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కొన్ని కీలకమైన ఆర్థిక

2 లో

## 100 శాతం
# చెత్త సేకరణ, ప్రాసెసింగ్ జరగాలి

- సీఎం చంద్ర బాబు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పైసమీక్ష

అమరావతి, ఏప్రిల్ 17:(ప్రజా సీమ): ఇంటింటికీ చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ కూడా 100 శాతం జరగాలన్నారు. కంపోస్ట్ మార్కెటింగ్ చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు సమన్వయ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు స్వచ్ఛాంధ్ర సాకారం కావడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు అయన ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోవడంలో విఫలమైతే... కారణాలు అన్వేషించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఈ ఏడాది మార్చి 31 వరకు రూపొందించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాంకులను అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు జిల్లాలు స్వచ్ఛాంధ్రలో మొదటి మూడు స్థానాల్లో ఉండగా... శ్రీ సత్యసాయి, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలు చివరి మూడు స్థానాల్లో ఉన్నట్టు తెలిపారు. ఇందులో విశాఖ జిల్లాకు 92 శాతం, విజయనగరం, గుంటూరు జిల్లాలకు 85 శాతం మార్కులు వచ్చాయి. అట్టడుగున ఉన్న ఏఎస్ఆర్ జిల్లాకు కేవలం 53 శాతం మార్కులు మాత్రమే వచ్చాయి. డోర్ టు డోర్ కలెక్షన్,



తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ వంటివి ర్యాంకులకు ప్రాతిపదికగా తీసుకున్నట్టు చెప్పారు.. అయితే ఇకపై జిల్లాలకు స్వచ్ఛాంధ్ర ర్యాంకులు థర్డ్ పార్టీ ఇచ్చేలా చూడాలని సీఎం సూచించారు.

**జూన్ కల్లా 100 శాతం చెత్త క్లియర్**

మున్సిపాలిటీల్లో అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే నిర్ణీత పరిధిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పేలా

2 లో

## మహిళల ఉసురు
# మీకు తగులుతుంది



-హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ ఏప్రిల్ 17 (ప్రజా సీమ) మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు.

## రాజ్యాంగంపై
# దాడిని అడ్డుకున్నాం



- రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ ఏప్రిల్ 17 (ప్రజా సీమ): లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఇది రాజ్యాంగం సాధించిన విజయమని అభివర్ణించారు. "సవరణ బిల్లు పడిపోయింది. మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి వారు రాజ్యాంగ విరుద్ధమైన ఉపాయాన్ని ఉపయోగించారు. భారతదేశం అది గమనించింది. 'ఇండియా' కూటమి దానిని ఆపింది. రాజ్యాంగానికి జై" అని ఆయన పేర్కొన్నారు. ఇది మహిళలకు సంబంధించిన బిల్లు కాదని, డీలిమిటేషన్ పేరుతో దక్షిణ,

2 లో

## మహిళా రిజర్వేషన్ పేరిట
# బీజేపీ మాయోపాయం : షర్మిల

అమరావతి 17 (ప్రజా సీమ): ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ కుతంత్రాలకు పాల్పడిందని, అయితే వారి మాయోపాయం ఫలించలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఇది ఎన్డీఏ అధర్మంపై ఇండియా కూటమి సాధించిన ధర్మయుద్ధ విజయమని, ప్రజాస్వామ్యం నిలబడిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "విఫలమైంది అతి గతి లేని డీలిమిటేషన్ బిల్లే తప్ప, మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. మహిళా బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది. విపక్షాలు ఎన్నడూ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను మాత్రమే ప్రతిపక్షాలు తిప్పికొట్టాయి" అని స్పష్టం చేశారు. మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి ఇది చెంపపెట్టు లాంటిదని ఆమె ఘాటుగా విమర్శించారు. సాధికారత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలనే బీజేపీ కుయుక్తులు చెల్లలేదని అన్నారు. ఇది భారతదేశ ప్రజల

2 లో



# సంపాదకీయం

## ప్రజలకు మరింత భారం కానున్న సీట్ల పెంపు !

మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, చట్టసభల్లో అమలుకు నోచుకుని మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం నారీ శక్తి వందన్ అధినియమ్ మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు పట్టుదలగా ఉంది. నిజానికి ఇది ఎన్నో ఏళ్ల కల. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. ఈ క్రమంలో దేశంలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్ అన్నది హక్కుగా దక్కాల్సిందే. పురుషాధిక్యాన్ని ఎదురొడ్డి నిలబ డాలంటే వారికి రిజర్వేషన్లు ఉండాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఉన్న సీట్లకు అనుగుణంగా అమలు చేయకుండా లోక్‌సభ సీట్లను 816కి పెంచడం అన్నది చాలా దారుణం. ఎందుకంటే ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లతోనే దేశం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీత భత్యాలు, పెన్షన్లు, క్వార్టర్లు, విమాన ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసి మోపెడువుతున్నాయి. ఈ ఖర్చులను తగ్గించి, జీతభత్యాల్లో కోత విధించి, పెన్షన్లు తగ్గించాల్సి ఉన్నా వాటిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు వీరికెందుకన్నది చెప్పడం లేదు. ఒక్కొక్కరు రెండేసి పెన్షన్లు పొందుతు న్నప్పటికీ ఘనత వహించిన మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు. దీనిగురించి చట్టసభల్లో అడిగేవారు లేరు. ఇప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేల ఖర్చులు వేల కోట్లల్లో ఉంటోంది. దీనిని మరింతగా పెంచడం కన్నా తగ్గించాలి. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే ఓ 50 లేదా 60 వరకు పెంచి వుంటే బాగుండేది. కనీసం ఓ 600 వరకు పెంచి, అందులో 250 మహిళలకు కేటాయిస్తే మంచిది. ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచి జనం మీద బాదే బదులు తగ్గిస్తే మంచిది. సీట్లు పెంచడం లాభం కనుక పెంచుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ మహిళా భివృద్ధి కోసం పాటుపడే లక్ష్యంలో మాత్రం అభినందించాల్సిందే. మహిళల విద్యకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఊతమివ్వాలి. విద్యారంగంలో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. ఉదారంగా వారికి రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ చేస్తూనే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి అవకాశం కల్పించాలి. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న పార్టీలు ఇవన్నీ చర్చించాలి. సీట్ల సంఖ్యను పరిమితం చేసి, జీతభత్యాలన ఎత్తేసి, పెన్షన్లను రద్దు చేసేలా చర్చ చేయాలి. కేవలం రాజకీయ లబ్ది కోసమే చేయడం అన్నది సరికాదు. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారిందన్న గణాంకాలు ఉన్నాయి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బిజెపి గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. 1998 ఎన్నికల్లో బిజెపికి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బీహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే.. బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్‌ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. అంటే మహిళలు అండగా ఉన్నందున ప్రతి విషయంలోనూ బిజెపి వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి. ఇబ్బడిముబ్బడిగా ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి, మహిళల కోసమే అని చెప్పడం సరికాదు. సీట్ల సంఖ్యను పెంచకుండానే వారికి 33శాతం అమలు చేయవచ్చు. విపక్షాలు కూడా ఇదే కోరుతున్నాయి. 2019లో 89.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 46.5 కోట్ల మంది పురుషులు, 43.1 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 2024కి 96.8 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు 47.1 కోట్లకి చేరారు. అంటే 2019కి కంటే 2024కి నాలుగు కోట్లమంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇక ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు 2.63 పెరగగా వారిలో 1.41 కోట్ల మంది మహిళలు, 1.22 మంది పురుషుల ఓటర్లు పెరిగారు. 2019లో 12 రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో మహిళా ఓటర్లు పెరిగారు. అయితే 2024లో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటింగ్ పెరిగింది. అందువల్ల న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను ఇవ్వాల్సిందే. అయితే అందుకోసం ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను భారీగా పెంచడం సరికాదు. ఇప్పుడున్న లోక్‌సభ సీట్లు 543 కాస్తా.. 816కి పెరుగుతాయని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సీట్ల కేటాయింపుల్లో కూడా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాల పరంగానూ, ఇటు రాష్ట్రాల పరంగానూ ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగడం ఓ రకంగా రాజకీయ పార్టీలకే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ÷ూజకీయంగా మహిళలు ఎదగాలన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరికీ వ్యతిరేకత లేదు. రాజకీయాల్లో ధనబలం, కండబలం నిరోధించాలంటే మహిళలను రాజకీయాల్లోకి తీసుకుని రావాల్సిందే. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛను కూడా ఇవ్వాల్సిందే. ఆస్తిలో హక్కులు కల్పించాల్సిందే. ఒకవేళ గెలిచినా.. మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనివ్వాలి. సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా ఉంటే మంచి సమాజాం ఏర్పడుతుంది. సీట్ల పెంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. మహిళా కోటాను అమలు చేయడం కోసం సీట్లు పెంచాలనుకోవడం సరికాదు. అందువల్ల ఉన్న సీట్లలో 33శాతం అమలు చేయడమో లేదా, ఇపుడు 542ను 200కు పెంచడమో సబబుగా ఉంటుంది. ఏకంగా 816కు పెంచడం దేశంపై ముఖ్యంగా పన్నులు కట్టే ప్రజలపై భారం మోపడమే అవుతుంది.

# కష్టపడే కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుంది

- పార్టీ కోసం కష్టపడే వారే పదవులు తీసుకోవాలి - ఫోటోలకు ఫోజులిస్తే పార్టీ గ్రామస్థాయిలో బలపడదు
- కలసికట్టుగా పనిచేస్తేనే విజయం సాధించగలం - టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు









సిద్ధవటం,(ప్రజా సీమ) కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ సమచిత స్థానం ఇస్తుందని, పార్టీ కోసం కష్టపడే వారే పదవులను తీసుకోవాలని, ఫోటోలకు ఫోజులిస్తూ ప్రకటనలు ఇస్తే పార్టీ బలోపేతం కాదని, కలసికట్టుగా గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరు పనిచేస్తేనే పార్టీకి విజయం సాధ్యమవుతుందని రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. శుక్రవారం నాడు సిద్ధవటం మండలం నందు స్థానిక పార్టీ కార్యాలయం నందు సిద్ధవటం మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి చమర్తి జగన్ మోహన్ రాజుముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైకాపా అరాచకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తలు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని,కార్యకర్తకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన అండగా ఉంటానని చమర్తి హామీ ఇచ్చారు.అంతేకాకుండా రాబోయే రోజుల్లో పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేయాలని పార్టీ శ్రేణులకు జగన్ మోహన్ రాజు సూచించారు. పార్టీ శ్రేణులు అంతా కలిసికట్టుగా పనిచేయాలని,పార్టీ నిర్దేశించినకార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాల్సిందేనని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని చమర్తి హెచ్చరించారు. అంతకుముందు ఇటీవల రాష్ట్ర కమిటీ లో నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన శనివారపు మోహన్ రెడ్డి ని అభినందించి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్,రాష్ట్ర కమిటీ సభ్యులు,పార్లమెంట్ కమిటీ సభ్యులు,మండల పార్టీ అధ్యక్షులు, సింగల్ విండో చైర్మన్లు,ఆలయ చైర్మన్లు,ప్రధాన కార్యదర్శి, మండల క్లస్టర్ ఇన్చార్జ్లు, యూనిట్ ఇన్చార్జులు , గ్రామ అధ్యక్షులు,బూత్ కన్వీనర్లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి శిక్ష

నెల్లూరు ఏప్రిల్ 17 (ప్రజా సీమ): నెల్లూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన జతీ.చీశీ.36/2021 కేసులో నిందితుడికి శుక్రవారం నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు నిందితుడికి 13 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.20,000 జరిమానా క్రింది విధంగా శిక్ష విధించింది . ఈ కేసులో నిందితుడు మైనర్ బాలికపై లైంగిక దాడి చేసి, బాల్య వివాహానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. కేసును సమర్థవంతంగా విచారించి, సాక్ష్యాధారాలను బలంగా సమర్పించడం ద్వారా కోర్టులో నేరం రుజువైంది.మహిళలు, బాలికలపై జరిగే నేరాల విషయంలో పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ప్రజలకు జిల్లా ఎస్పీ సూచించారు.

## మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం : షర్మిల

విజయమని, బీజేపీ రాజకీయ దురుద్దేశానికి ఇది చరమ గీతమని అభివర్ణించారు. ప్రతిపక్షాలపై బురదజల్లడం మాని, మహిళలపై చిత్తశుద్ధి ఉంటే 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. దేశంలోని 543 లోక్‌సభ స్థానాల్లో వెంటనే 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, తమ నిజాయతీని నిరూపించుకోవాలని బీజేపీకి సవాల్ విసిరారు.

## రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం

ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర అని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 వీగిపోయింది. శుక్రవారం సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓటమి పాలైంది. విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు ఐక్యంగా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో ఉన్న సభ్యులలో మూడింట రెండొంతుల మంది, అంటే 358 మంది సభ్యుల మద్దతు అవసరం. కానీ, ప్రభుత్వానికి 60 ఓట్లు తక్కువయ్యాయి. మహిళా రిజర్వేషన్ల అమలును భవిష్యత్తులో చేపట్టే డెలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియతో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

## నేడు కేంద్ర కేబినెట్ అత్యవసర సమావేశం

సంస్కరణల పై కేంద్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీనివల్ల స్టాక్ మార్కెట్, పారిశ్రామిక వర్గాలు ఈ భేటీ ఫలితాల కోసం వేచి చూస్తున్నాయి. రాబోయే పార్లమెంట్ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని లేదా అత్యవసరంగా అమలు చేయాల్సిన కొన్ని కీలక బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. గతంలో ఇలాంటి అత్యవసర భేటీల్లోనే ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు వంటి సంచలన నిర్ణయాలకు పునాది వేసిన విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. భారతదేశ ఆర్థిక స్థితిగతులను, అంతర్జాతీయ సంబంధాలను ప్రభావితం చేసే నిర్ణయాలు రేపటి సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉండటంతో, దేశవ్యాప్తంగా అందరి చూపు ఢిల్లీ వైపే ఉంది. శనివారం మధ్యాహ్నం లోపు ఈ భేటీకి సంబంధించిన అధికారిక వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లులో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగిన విషయం తెలిసిందే. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. నేడు జరిగే కేబినెట్ సమావేశంలో దీనిపై చర్చించే అవకాశాలు ఉన్నాయి.

## 100 శాతం చెత్త సేకరణ, ప్రాసెసింగ్ జరగాలి

చూడాలన్నారు. గతంలో వ్యర్థాలతో నిండిపోయిన డంపింగ్ యార్డుల్లో... ప్రస్తుతం చెత్త క్లియర్ చేయడంతో పాటు ఆయా స్థలాలను పచ్చదనంతో నింపేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణానికి సమీపంలో ఉన్న డంపింగ్ కేంద్రాలను ముందుగా పార్కులుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఇంటింటికీ చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ కూడా 100 శాతం జరగాలన్నారు. కంపోస్ట్ మార్కెటింగ్ చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు సమన్వయ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. మ్యాజిక్ డ్రెయిన్లకు అనుసంధానంగా కమ్యూనిటీ సోక్ పిట్స్ తీసుకురావడం ద్వారా మురుగునీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహద పడుతుందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, నెట్ జీరో, గ్రీనరీ పెంపు, క్లీన్-హైజీన్ కిచెన్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. గాలి నాణ్యత పర్యవేక్షణకు ప్రస్తుతమున్న 83 ప్రాంతాలతో పాటు, అదనంగా 53 మాన్యువల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

### డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు, ఈ వేస్ట్ కలెక్షన్‌కు సంబంధించి అమలు చేస్తున్న విధానాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నామని, గోబర్ ధన్ యూనిట్లు, గ్రీన్ షాప్స్ ద్వారా చెత్తను ఆదాయంగా మారుస్తున్నామని అధికారులు తెలిపారు. మురుగు నీటి నిర్వహణలో కూడా సమూల మార్పులు తెస్తున్నామని... గ్రే వాటర్, బ్లాక్ వాటర్ నిర్వహణకు భారీ ప్రాజెక్టులు చేపట్టినట్టు వివరించారు. పొడి చెత్తను సేకరించే గ్రీన్ షాపులకు స్వచ్ఛ రథం ఏజెన్సీ నుంచి, పంచాయతీ నుంచి సాయం అందించేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం అవుతాయని వెల్లడించారు. అలాగే 'స్వచ్ఛ పథం' పేరుతో గ్రామీణ రోడ్ల శుభ్రత కోసం ప్రత్యేక వాహనాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

### 590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు

10 జిల్లాల్లో 590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. పట్టణాల్లో 2024-2026 మధ్య గ్రీన్ స్పేస్ పార్కులు 57 అభివృద్ధి చేసినట్టు వివరించారు. మరో 284 గ్రీన్ స్పేస్ పార్కులు, 100 స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని అధికారులు తెలపగా, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. గ్రామాల్లో మురుగునీటి నిర్వహణకు సోక్ పిట్స్, కిచెన్ గార్డెన్స్, మ్యాజిక్ డ్రెయిన్స్ వంటి విధానాలు అవలంభిస్తున్నామని, ఈ ఏడాది డిసెంబర్ కల్లా... 7.14 లక్షల కిచెన్ గార్డెన్స్, 1 లక్ష సోక్ పిట్స్, 8,000 కమ్యూనిటీ సోక్ పిట్స్, 100 కి.మీ. మ్యాజిక్ డ్రైన్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా నిలపాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతంగా ఉన్న గ్రీన్ కవర్‌ను... 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమీక్షలో మంత్రి నారాయణ, పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఎంఏయూడీ కమిషనర్ సంపత్ కుమార్, పంచాయతీరాజ్ శాక డైరెక్టర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక ప్రజాసీమ జాతీయ తెలుగుదినపత్రిక


# గిరిజన సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం

## - మదనపల్లి జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటుకు కృషి - ఎస్టీ కమిషన్ సభ్యుడు పి.వెంకటప్ప వెల్లడి






మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లిలో ఐటీడీఏ ఏర్పాటు,గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించేలా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప తెలిపారు.శుక్రవారం మదనపల్లిలోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గిరిజన సంఘాల నాయకులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొని వారి సమస్యలను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాజంపేట,రాయచోటి,మదనపల్లి ప్రాంతాల్లో ఎరుకుల,యానాది,సుగాలి,లంబాడి గిరిజనులు అధికంగా నివసిస్తున్నారని తెలిపారు.వారి జీవన పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.మదనపల్లిలో ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించి,భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే రాజంపేట పరిధిలో యానాది గిరిజనులకు ఆధార్ కార్డులు లేవని,దీనిపై చర్యలు తీసుకోవాలని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా ప్రభుత్వ గిరిజన హాస్టళ్లు,పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని,ఎస్సీ,ఎస్టీ భూములకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా పి.వెంకటప్ప మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఎరుకుల,యానాది, సుగాలి వర్గాల జీవనోపాధి అభివృద్ధికి ఐటీడీఏ అధికారులతో చర్చించి అవసరమైన నిధులు,ఆధార్ కార్డ్ల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం మదనపల్లి జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.గిరిజనుల అటవీ హక్కుల భూములకు సంబంధించిన ఆర్.ఓ.ఆర్ పట్టాల సమస్యలను ఫారెస్ట్ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని,గిరిజన కాలనీల్లో తాగునీరు,విద్య,వైద్యం,పింఛన్లు,విద్యుత్,గృహ వసతి వంటి మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గిరిజనులకు ఎదురవుతున్న ప్రతి సమస్యను జిల్లా కలెక్టర్,గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.అంతకుముందు మదనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో,పాఠశాల ప్రిన్సిపాల్స్,వార్డెన్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.తేజస్విని,ఆర్‌జీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోనేటి దివాకర్,ఇరిగేషన్ శాఖ డీఈ గంగాధర్,నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ వ్యవస్థాపకులు రవీంద్ర,ఆదివాసి ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస వర్మ,రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు సాకే మసలయ్య,ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు కిరణ్ బాబు,గిరిజన నాయకులు బొజ్జప్ప,సులోచన,మున్నా నాయక్,విశ్వనాథ నాయక్,శ్రీనివాస శర్మ,జీవీ రమణ,కోనయ్య,లక్ష్మణ నాయక్,గంగరాజు నాయక్,నాగు నాయక్,వెంకటరమణ,వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నూతన డీఎస్పీ పావనిని కలిసిన తెలుగుదేశం నేతలు

## - పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనసత్కారం




మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లి నూతన డిఎస్పీగా పావని ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సంగతి విధితమే.ఈ నేపథ్యంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆర్.జె.వెంకటేష్,రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు,రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి విజయమ్మ,పూల మురళి,శ్యామల,మాజీ కౌన్సిలర్ రామకృష్ణ,రేగడి ప్రసాద్ కుమార్,గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున,రెడ్డెప్ప తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా ఆమెకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ డీఎస్పీగా తొలి పోస్టింగ్ మదనపల్లెకి యువ అధికారిణి పావనిని నియమించడం శుభసూచకమన్నారు.మతసామరస్యానికి,ప్రశాంత వాతావరణానికి మదనపల్లి మారుపేరని వివరించారు.ఎస్పీ ధీరజ్ కునుబిల్లి,డీఎస్పీ పావనిల సారథ్యంలో పోలీస్ యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని నేరాల నియంత్రణ,శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లాను అగ్ర భాగంలో నిలపాలని ఆకాంక్షించారు.అనంతరం నూతన డిఎస్పీ మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.పోలీస్ యంత్రాంగానికి అన్నిపార్టీల వారు సహకరించాలని,తద్వారా పట్టణంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుదామని పిలుపునిచ్చారు.

# నిర్లక్ష్యపు నీడలో రైల్వేకోడూర్ నియోజకవర్గం




రైల్వేకోడూరు (ప్రజా సీమ) :రైల్వే కోడూరు నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక వాడ అనే నినాదంలో భాగంగా తిరుపతి జిల్లాలో అనేక రాజ్జు లను ఏర్పాటు చేస్తున్న కూటమి ప్రభుత్వం రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని జనసేన పార్టీ సీనియర్ నాయకులు గంధం శెట్టి దినకర్ బాబు ఆరోపించారు... ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుపతి జిల్లాలో రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని కలపడం శుభపరిణామం.. ఆధ్యాత్మిక క్షేత్రం అయిన తిరుపతి జిల్లాను పారిశ్రామిక క్షేత్రంగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నా.. ఇప్పటికే శ్రీ సిటీలో స్పెషల్ ఎకానమిక్ జోన్లో జాతీయ అంతర్జాతీయ కంపెనీల ఏర్పాటు , తగిన పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నది.. స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా సూక్ష్మ , చిన్న , మధ్య తరహా పరిశ్రమలను సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి , నాయుడుపేట - మేనకూరు రాజ్జు , సత్యవేడు , రేణిగుంట తదితర ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసి అనేక రకాల ప్రోత్సాహకాలతో ఆ ప్రాంత ప్రజలకు, యువకులకు , నిరుద్యోగులకు అనేక ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు.. అదే సమయంలో రైల్వే కోడూరు నియోజకవర్గ ప్రాంతంలో కూడా చిన్న , మధ్య, సూక్ష్మ తరహపరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగ పడుతుందని ప్రభుత్వాన్ని కోరారు.. స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా ప్రభుత్వం రాష్ట్రాన్ని ఒక రాజ్జు గా భావించి .. చేస్తున్న ఈ అభివృద్ధిలో దయచేసి రైల్వే కోడూరు ప్రాంత యువకులకు , నిరుద్యోగులకు అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు గంధం శెట్టి దినకర్ బాబు కోరారు. అనేకమంది యువకులు , మహిళలు ఇక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు ఇప్పటికీ వెళుతున్నారని... ఈ పరిస్థితిని నిరోధించి , ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని , ఉపముఖ్యమంత్రిని ఈ సందర్భంగా ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒకే కుటుంబంలో ఇద్దరికి నామినేటెడ్ పదవులా..!

## - పార్టీ కోసం కష్టపడ్డ వారికి లభించే గౌరవం ఇదేనా - తెలుగు తమ్ముళ్లలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు - నాడు పెద్దిరెడ్డి కుటుంబానికి వ్యతిరేకంగా పోరాటం - టిడిపి సీనియర్ నేత ఆర్.జె.వెంకటేష్ ఆరోపణలు



మదనపల్లె (ప్రజా సీమ) : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకోరావడానికి సర్వశక్తులు ఒడ్డిన నాయకులు,కార్యకర్తలకు నేడు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని టిడిపి సీనియర్ నేత ఆర్.జె వెంకటేష్ పేర్కొన్నారు.శుక్రవారం నిమ్మనపల్లి కూడలిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు,రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి విజయమ్మ,పూల మురళి,శ్యామల,మాజీ కౌన్సిలర్ రామకృష్ణ,రేగడి ప్రసాద్ కుమార్,గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున,రెడ్డెప్పలతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పార్టీ కోసం నిజంగా పనిచేసిన వారికి గౌరవం దక్కడం లేదన్నారు.ఇందుకు తానే నిదర్శనమని,అధిష్టానం ఏ అంశాలను పరిగణనలోకి తీసుకొని నామినేటెడ్ పదవులను కేటాయిస్తుందో అర్థం కావడం లేదన్నారు.గతంలో టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు మదనపల్లిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్వయంగా తన పేరును ప్రస్తావిస్తూ నియోజకవర్గం వ్యాప్తంగా పర్యటించి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారన్న విషయాన్ని గుర్తుచేశారు.అదేవిధంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి కుటుంబానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశామని,అందులో భాగంగా జరిగిన ఘర్షణల్లో రాటకొండ మధుబాబు లాంటివారు తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి జిల్లాలో టిడిపి విజయంలో క్రియాశీలక పాత్ర పోషించారని,ఆయనతో కలిసి తాము ముందుకు నడిచిన తీరును వివరించారు.ఆయన సేవలను గుర్తించకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు.ప్రస్తుతం టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటుగా ఎన్నికైన మంత్రి లోకేష్ బాబు క్షేత్రస్థాయిలో దృష్టి సారించి పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని,లేనియెడల పార్టీ మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు.అనంతరం రాటకొండ మధుబాబు మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ఇద్దరికి నామినేటెడ్ పదవులు కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు.తాను ఒక్క మదనపల్లి గురించి మాట్లాడడం లేదని,రాష్ట్రవ్యాప్తంగా 72 మందికి రెండు నామినేటెడ్ కేటాయించారని వెల్లడించారు.ఒకరికే రెండు పదవులు కట్టబెట్టడం కన్నా ఆ పదవులను మరొకరికి కేటాయిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.గతంలో ఎవరినైనా పార్టీలో చేర్చుకోవాలంటే సీనియర్లుగా తనతోపాటు ఆర్.జె.వెంకటేష్ సలహాలు తీసుకునే వారన్నారు.ప్రస్తుతం సొంత పార్టీలోని వారిని కాదని ఇతర పార్టీలో నుంచి వలసలు వచ్చిన వారికి అందలమెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసలు టిడిపి కేంద్ర కార్యాలయంలో ఏం జరుగుతుందో సీఎం చంద్రబాబు గ్రహించాలన్నారు.కేవలం పైరవీలు,డబ్బులు ముట్ట చెప్పిన వారికే నామినేటెడ్ పదవులు ఎలా వస్తున్నాయని సూటిగా ప్రశ్నించారు.ఇప్పటికైనా పార్టీ అధిష్టానం మేల్కొని పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు.అనంతరం రేగడి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ టిడిపిలోని కొందరు నేతలు వైసిపి మునిగిపోతున్న నావ అని భ్రమలో చంకలు గుద్దుకుంటున్నారని,వాస్తవానికి ఆ పార్టీ క్షేత్రస్థాయిలో ఎంతో బలోపేతమవుతోందని స్పష్టం చేశారు.పార్టీలో ఇంటి దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.ఇంటి దొంగలను దూరం పెట్టకపోతే 2019 పరిస్థితే 2029లో వస్తుందని ఆయన హెచ్చరించారు.పార్టీలో కార్యకర్త కీలకమని,పార్టీలోని నామినేటెడ్ పదవులు ఎవరికి కేటాయించిన కార్యకర్త పార్టీ కోసమే పనిచేస్తాడని స్పష్టం చేశారు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ బాబు పార్టీలో ప్రక్షాళన చేపట్టి జిల్లాలో టిడిపిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు


# బెంగళూరులోని సిస్కో కంపెనీని సందర్శించిన మిట్స్ విద్యార్థులు

## - సాంకేతిక అంశాలపై అవగాహన,ఇంటరాక్టివ్ సెషన్




కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగం ఆధ్వర్యంలో బి.టెక్ మూడవ సంవత్సరం డేటా సైన్స్‌కు చెందిన 45 మంది విద్యార్థులు మరియు అధ్యాపకుల బృందం కలిసి ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శుక్రవారం బెంగళూరులోని ప్రతిష్టాత్మక సిస్కో కంపెనీని సందర్శించారు.విద్యార్థులకు పరిశ్రమ అనుభవం మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించడమే ఈ విజిట్ ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిస్కో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (ఇంజినీరింగ్) మల్లిరావు డేటా అనలిటిక్స్,కృత్రిమ మేధస్సు (ఏఐ),నెట్‌వర్కింగ్ టెక్నాలజీలు మరియు క్లౌడ్ కంప్యూటింగ్ వంటి తాజా సాంకేతిక అంశాలపై అవగాహనాత్మకమైన మరియు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు.సిస్కోలో ప్రస్తుత పరిశోధనలు,ఆధునిక సాంకేతిక అభివృద్ధులు మరియు భవిష్యత్ టెక్నాలజీ ధోరణులపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.కృత్రిమ మేధస్సు,మెషిన్ లెర్నింగ్,డేటా సైన్స్,క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ,ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి రంగాల్లో సిస్కో సంస్థ విస్తృతంగా పనిచేస్తోందని తెలిపారు.విద్యార్థులు నూతన జెనరేటివ్ ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన పెంచుకుని,భవిష్యత్ కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.కిరణ్ కుమార్,బి.విద్యశ్రీల బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అనాధవృద్ధులకు అల్పాహారం ఏర్పాటు




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:స్థానిక మధర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాధవృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. శుక్రవారం గండి కొవ్వూరు గ్రామానికి చెందిన రాజగోపాల్ రెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అల్పాహారం, స్వీట్లు పంపిణీ చేశారు. అనాధల పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని, వీరికి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు కోరారు. తమ కుమారుని వర్ధంతిని అనాధవృద్ధుల మధ్య ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

# పాలేటి గంగమ్మ ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలి

**- మాజీ సర్పంచులు పసుపులేటి చలపతి,పార్వతమ్మలు ఆకాంక్ష**

**- ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 విరాళం**





మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లి రూరల్ మండలం,చిప్పిలి గ్రామం,బెంగళూరు రోడ్డులో వెలసిన శ్రీ పాలేటి గంగమ్మ ఆలయ అభివృద్ధికి మాజీ సర్పంచులు పసుపులేటి చలపతి,పార్వతమ్మ దంపతులు సహకారం అందిస్తున్నారు.ఈ దంపతులు ఇద్దరు శ్రీ పాలేటి గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుకోగా వీరికి ఆలయ అర్చకులు,ఆలయ కమిటీ నిర్వాహకులు,గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.అర్చకులు అమ్మవారిని దర్శనభాగ్యం కల్పించి ఆలయ సంప్రదాయాల మేరకు ఘనంగా సన్మానించారు.ఇందులో భాగంగా ఆలయ అభివృద్ధి కోసం చలపతి,పార్వతమ్మ దంపతులు రూ. 1,00,116 నగదును విరాళంగా అందజేశారు.అమ్మవారి ఆశీస్సులు చలపతి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని,వారు నిత్యం సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో జీవించాలని అర్చకులు దీవించారు.త్వరలో జరుగబోయే శ్రీ పాలేటి గంగమ్మ జాతరను ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా కలసిమెలిసి జరుపుకోవాలని చలపతి సూచించారు.అదేవిధంగా అమ్మవారి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి,పంటలు బాగా పండాలని తద్వారా ప్రతి ఇంట సిరిసంపదలు తులతూగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు చిప్పిలి మల్లికార్జున రెడ్డి,శివారెడ్డి,రజిని, బయ్యా రెడ్డి,బండి అమర,పసుపులేటి వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపోలను ఆకస్మిక తనిఖీ చేసిన జోన్ ఈడీ రాఘవ కుమార్

**- ఘనంగా సన్మానించిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు**







మదనపల్లె (ప్రజా సీమ) : ఏపీపిటీడీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాఘవ కుమార్ శుక్రవారం 1,2 డిపోల విస్తృత సాయి తనిఖీ నిమిత్తం మదనపల్లికి విచ్చేశారు.ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా ఈయు కమిటీ సభ్యులు,మదనపల్లి 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ సభ్యులు మరియు ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి,శాలువాలతో ఘనంగా సత్కరించారు.అదేవిధంగా అన్నమయ్య జిల్లా డీపీటీఓ రాముకి పుష్పగుచ్ఛం అందజేశారు.

మదనపల్లి బస్టాండ్,కార్గో పాయింట్స్,మదనపల్లి 1,2 డిపోల గ్యారేజీలను ఆయన తనిఖీ చేశారు.అదేవిధంగా జిల్లా నాయకులు కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఈడికి వినతి పత్రం అందజేశారు.డీపీటీఓ కార్యాలయాన్ని మదనపల్లికి త్వరగా తరలించాలని,మదనపల్లిలో ఆర్టీసీ డిస్పెన్సరీనీ ఏర్పాటు,రెస్ట్ రూములు,పరిశుభ్రమైన టాయిలెట్స్ ఏర్పాటు,టిమ్ లలో డేటా ఆనులో ఉండటం వలన పవర్ బ్యాంకు ఉన్ననూ,టిమ్ చార్జింగ్ తొందరగా అయిపోతుందని,కాబట్టి టిమ్ లో డేటా ఆఫ్ సెట్టింగ్స్ ఏర్పాటు,మదనపల్లి జిల్లా అయినందున,జిల్లా కేంద్రంలో పనిచేసే ఉద్యోగులకు హెచ్.ఆర్.ఏ 12 శాతం నుండి 16 శాతానికి పెంచాలని వంటి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఈడీకి అందజేశారు.ఈ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మదనపల్లి 1,2 డిపోల మేనేజర్లు వెంకటరమణారెడ్డి,అమరనాథ్,అన్నమయ్య జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ పీవీ బయ్యారెడ్డి,జిల్లా గౌరవ అధ్యక్షుడు సీఏ బాబు,జిల్లా కార్యదర్శి సాంబశివరెడ్డి,ఉపాధ్యక్షుడు ఎస్.కె రెడ్డి,మదనపల్లి - 1 డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కె.శివయ్య మరియు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

# 'వెలుగు'లో శ్రీ విద్యా వికాస్ విద్యార్థుల విజయోత్సవ సంబరాలు

**- సెక్రటరీ ఉదయ మోహన్ రెడ్డి సేవలు అభినందనీయం - కళాశాల ప్రిన్సిపాల్,కరస్పాండెంట్ శివశంకర్ ప్రశంసలు**






మదనపల్లె (ప్రజా సీమ) : ఇటీవల ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన శ్రీ విద్యా వికాస్ జూనియర్ కళాశాలను రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిపిన విద్యార్థులు శుక్రవారం వెలుగు సంస్థకు విచ్చేశారు.మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్ట నందు గల వెలుగు సంస్థకు కళాశాల ప్రిన్సిపాల్,కరస్పాండెంట్ శివ శంకర్,సిబ్బంది విద్యార్థులు విచ్చేయగా వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి,సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికారు.ఇంటర్మీడియట్ - 2026 ఫలితాల్లో అన్నమయ్య జిల్లా,మదనపల్లె పట్టణంలోని శ్రీ విద్యా వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.జూనియర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను ఏ.సిరివల్లి 466 మార్కులు,కె.త్రివిక్రమ్ 464,డి.శిరీష 463,ఎస్.బాలాజీ 463 సాధించగా,టీ.సాగర్ 460,ఈ కీర్తి 459 మార్కులు సాధించారు.అదేవిధంగా 400పైగా మార్కులు 52 మంది విద్యార్థులు సాధించారు.జూనియర్ బైపీసీ విభాగంలో 455 మార్కులకుగాను ఎస్ నజ్మా 451,ఏస్.సుపినా 444,ఇ.మోనిక 443,ఎస్.సత్య 438, ఎస్ మరియం 433,దీక్షిత 432,ఎస్.షాఫీనా తాజ్ 432,జుహా 430 మార్కులు సాధించారు.మొత్తం 20 మంది విద్యార్థులు 400 పైగా మార్కులు సాధించారు.ఈ సందర్భంగా వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాదని,కృషి,సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని చాటిచెప్పిన మదనపల్లె శ్రీ విద్య వికాస్ జూనియర్ కళాశాలలోని విద్యార్థిని,విద్యార్థులను ప్రశంసించారు.అలాగే భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన ఫలితాలు సాధించి కళాశాల కీర్తి ప్రతిష్టలు పెంచడమే కాకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని.అనంతరం పోస్టర్లు ఆవిష్కరించి,కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి,జ్ఞాపికను అందజేశారు.అనంతరం శ్రీ విద్యా వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్,కరస్పాండెంట్ శివ శంకర్ మాట్లాడుతూ వెలుగు సంస్థ సెక్రటరీ దివ్యాంగులకు,వృద్దులకు చేస్తున్న సేవలను కొనియాడారు.ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీ విద్యా వికాస్ జూనియర్ కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు,సిబ్బంది,వెలుగు సెక్రటరీ కన్వీనర్ భాగ్యలక్ష్మి,ప్రిన్సిపాల్ లీనా కుమారి,వార్డెన్ స్వీటీ,సోషల్ వర్కర్ గీత,సిబ్బంది,చిన్నారులు,పాల్గొన్నారు.

# ఉచిత ధ్యాన--జ్ఞాన శిక్షణ కార్యక్రమం -- అందరికీ ఆహ్వానం




పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట మండల కేంద్రంలో ఉచిత ధ్యాన--జ్ఞాన శిక్షణ కార్యక్రమం ఆదివారం (19వ తేదీ) నిర్వహించనున్నట్లు పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజలందరూ ఆహ్వానితులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పుల్లంపేట మెయిన్ రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో నిర్వహించబడనుంది. మధ్యాహ్నం ధ్యాన ప్రసాదం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి పిరమిడ్ మాస్టర్ శ్రీ ఎస్. మునిబాబు ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణలో ధ్యానం ద్వారా శారీరక, మానసిక, ఆర్థిక, కుటుంబ, విద్య, ఉద్యోగ సమస్యలకు పరిష్కార మార్గాలు తెలియజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. విద్యార్థులు చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు, జ్ఞాపకశక్తి పెంపుకు, అలాగే ఆధ్యాత్మిక వికాసానికి ధ్యానం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పత్రీజీ మార్గదర్శకత్వంలో "శ్వాసపై ధ్యాసే ధ్యానం" అనే భావనతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందరూ పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు ఆహ్వానించారు

# రాష్ట్ర ఎస్టి కమిషన్ సభ్యులు కలిసిన కిల్లా విజయ్ కుమార్



పీలేరు(ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఈరోజు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు పి. వెంకటప్పను ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లా విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో గిరిజనులపై, ముఖ్యంగా గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులు, అన్యాయాల గురించి ఆయనకు వివరించారు. అలాగే అభివృద్ధికి నోచుకోని యానాది గిరిజనుల దయనీయ పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా గిరిజనుల యొక్క పలు సమస్యలను ప్రస్తావిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా గిరిజనులపై, ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,యానాది గిరిజనులకు నివాస, విద్య, ఆరోగ్య సదుపాయాలు మెరుగుపరచాలని .అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు భూములపై పూర్తి హక్కులు కల్పించాలని .గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచి, వలసలను తగ్గించే చర్యలు చేపట్టాలని,ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని కోరారు.గిరిజనుల సమస్యలపై స్పందించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు పి.వెంకటప్ప, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**- సిబ్బందికి 6 నెలల నుంచి జీతాలు అందడం లేదు...**

**- సమస్యలు పరిష్కరించకపోతే నిరాహార దీక్షలు చేపడుతాం**

**- కాంగ్రెస్ ఇంఛార్జీ మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: మేజర్ పంచాయతీ అయిన వేంపల్లె గ్రామ పంచాయతీలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇంచార్జీ మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థానిక ఎంపిడిఓ కుళాయమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా పారిశుధ్య, వివిధ సిబ్బందికి జీతాలు అందడం లేదని, దీంతో వేంపల్లె పంచాయతీ పరిధిలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే పడి దుర్వాసన వెలువడుతుందని, అలాగే మురికి కాలువల్లో నీరుకు బదులు ప్లాస్టిక్ కవర్ల, బాటిళ్లు, చెత్తాచెదారం దాపురించి ఉందని మండిపడ్డారు. ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా తయారై ఉన్నందున విష జ్వరాలు ప్రభలుతున్నాయని, ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపిడిఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే పారిశుధ్య సిబ్బందికి జీతాలు చెల్లింపుతో పాటు పిఫ్ నిధులు కూడా చెల్లించేందుకు కృషి చేయాలని కోరామన్నారు. దీంతో ఎంపిడిఓ కుళాయమ్మ సానుకూలంగా స్పందించి వీటిపై హామీ ఇచ్చారన్నారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ పక్షాన, ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.తులసిరెడ్డి నేతృత్వంలో పంచాయతీ కార్యలయం ముందు నిరాహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డా.సుబ్రమణ్యం, రామకృష్ణ, రామాంజనేయులు రెడ్డి, బద్రీనాథ్, వేమయ్య, రాఘవయ్య, పంచాయతీ అభివృద్ధి అధికారి నాగభూషణంరెడ్డి, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనగణనతో పథకాల తొలగింపు ఉండదు

**-ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

తిరుపతిఏప్రిల్ 17:కార్పొరేషన్ పరిధిలో జనగణను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం సాయంత్రం ప్రారంభించారు. తన కార్యాలయంలో అదనపు కమిషనర్ శారదా దేవి, ఆర్ ఓ సేతుమాధవ్ లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేత స్వీయ గణను చేయించారు. ఈ నెల చివరి వరకు స్వీయ గణన జరుగుతుందని, స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ స్వీయ గణన చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. అలాగే మొదటి దశ జనగణన 2027 ఫిబ్రవరి వరకు జరుగుతుందని ఆయన చెప్పారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి

## - మదనపల్లె అగ్నిమాపక అధికారి జి.శివప్ప సూచనలు





మదనపల్లె (ప్రజా సీమ) : జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు - 2026లో భాగంగా నాలుగవ రోజు శుక్రవారం మదనపల్లె అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో స్థానిక చిత్తూరు బస్టాండు,ఎంఎల్ఎల్ హాస్పిటల్ ఎదుట,నిమ్మనపల్లి సర్కిల్ మరియు పలుచోట్ల ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణ చర్యలు గురించి వివరిస్తు కరపత్రాలను పంచి పెట్టారు.అనంతరం స్థానిక వశిష్ట స్కూలు నందు విద్యార్థులకు,ఉపాధ్యాయులకు అగ్నిప్రమాదాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు,నివారణ చర్యలు గురించి సమగ్రంగా వివరించారు.ఏదేని ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఏ విధంగా బయటపడాలో మాక్ డ్రిల్స్ నిర్వహించి వివరించారు.ఈ సందర్భంగా మదనపల్లె అగ్నిమాపక కేంద్ర అధికారి జి.శివప్ప మాట్లాడుతూ ప్రమాదవశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా సమయస్ఫూర్తితో వ్యవహ రించాలని వెంటనే 101నెంబర్ కు ఫోన్ చేయాలని తెలియజేశారు.విద్యార్థులకు అడిగిన సందేహాలను సమాధానాలు చెప్పారు.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జి.ఎస్ రాజశేఖర్,డాక్టర్ టి.నవీన్,ప్రిన్సిపల్ ఎన్.సంధ్యారాణి,అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీ మండల బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా మల్లికార్జున రెడ్డి

## - శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు,కార్యకర్తలు





మదనపల్లె (ప్రజా సీమ) : వైఎస్ఆర్సిపి మదనపల్లి మండల బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా పొన్నేటిపాళ్యం పంచాయతీ,చిప్పిలికి చెందిన మాజీ సైనికుడు నాగిరెడ్డి గారి మల్లికార్జున రెడ్డి ఎంపిక య్యారు. ఈ మేరకు గురువారం పార్టీ అధిష్టానం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీకి మల్లికార్జున రెడ్డి అందించిన సేవలను గుర్తించి ఈ పదవి అప్పగించడం శుభపరిణామమన్నారు.26 సంవత్సరాలపాటు దేశానికి సేవ చేసిన ఆయన ప్రస్తుతం ప్రజాసేవకై పార్టీలో చురుకైన పాత్ర పోషించడం హర్షణీయమన్నారు.ఇదే స్ఫూర్తిగా పనిచేసే ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.అనంతరం మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ గతంలో 26 సంవత్సరాలపాటు ఆర్మీలో దేశానికి సేవలు అందించానని,ప్రస్తుతం ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే వైసీపీలో చేరడం జరిగిందని,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాటతీరు,విధానాలు తనను ప్రత్యేకంగా ఆకర్షించాయన్నారు.మదనపల్లి వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ సారధ్యంలో మండలంలో బూత్ కమిటీల బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి,ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,మదనపల్లి వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి,మాజీ మునిసిపల్ ఛైర్ పర్సన్ మనూజా రెడ్డి,యువజన విభాగం అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి,ఇతర పార్టీ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

# జనగణన శిక్షణలో భాగంగా ఫీల్డ్ విజిట్ -- ట్రైనీలకు మాక్ సర్వే





పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో జనగణన (సెన్సస్) శిక్షణ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్లు, శిక్షణాధికారులు ట్రైనీ అధికారులకు ఫీల్డ్ విజిట్ నిర్వహించి మాక్ సర్వే విధానంపై అవగాహన కల్పించారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న శిక్షణలో భాగంగా గ్రామాల్లో గృహాలను సందర్శించి డేటాను ఎలా సేకరించాలి, ఆన్లైన్లో ఎలా నమోదు చేయాలి అనే విషయాలను ప్రాయోగికంగా వివరించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు ట్రైనీలను ఇంటింటికీ తీసుకెళ్లి సర్వే ప్రక్రియను ప్రత్యక్షంగా చూపించారు.ట్రైనీఅధికారులు తమ సందేహాలను సూపర్వైజర్లను అడిగి నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీవో జయశ్రీ పర్యవేక్షిస్తూ సర్వే నిర్వహణ తీరును సమీక్షించారు. అధికారులు సూచించిన మార్గదర్శకాల ప్రకారం సర్వేను ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్ జి ఎస్ డబ్ల్యూ అధికారి శ్రీనివాసులు లక్ష్మీపతి ట్రైనీ సూపర్వైజర్లు సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు చారిత్రాత్మక అడుగు

## - జనసేన నేత దాసరి రవిశంకర్ - జనసేన సంపూర్ణ మద్దతు



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: నారీశక్తి వందన్ అధినియం మహిళా రిజర్వేషన్ బిల్లు మహిళా సాధికారతకు చారిత్రాత్మక అడుగు అని జనసేన నేత డా.దాసరి రవిశంకర్ అన్నారు. మహిళలకు రాజకీయ రంగంలో మరింత ప్రాతినిధ్యం కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. పార్లమెంట్ సమావేశంలో జనసేన పార్టీ తరపున కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. మహిళా శక్తిని బలోపేతం చేసేందుకు బిల్లు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో మహిళా అభివృద్ధికి సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం పెంపుదలకు జనసేన నిరంతరం కృషి చేస్తోందన్నారు.

# ప్రతి చెరువుకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి

## - జలధార-జలహారతి 100 రోజుల్లో ప్రణాళికతో పూర్తిచేయాలి

## - అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్




మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లాలో చేపట్టిన జలధార - జలహారతి 100 రోజుల కార్యాచరణను పక్కా ప్రణాళికతో అమలు చేసి అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం మదనపల్లి కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జల వనరుల శాఖ,డ్వామా,భూగర్భ జలాలు,సబ్ కలెక్టర్,ఆర్డీవోలుమండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు,ఏపీడీలు,ఇంజనీరింగ్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో గతవారం,ప్రస్తుత వారంలో సాధించిన ప్రగతిని పరిశీలించి తదుపరి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.జిల్లాలోని మండలాల వారీగా జలధార-జలహారతి కార్యక్రమాల అమలు ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారులు వివరించగా,కలెక్టర్ పనులలో లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పనిని ఖచ్చితమైన కొలతలతో వందశాతం నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలో ఉన్న చెరువులు,వాగులు,వంకలను గుర్తించి వాటి నీటి ప్రవాహ మార్గాలను ఆర్డర్-1,2,3 ప్రకారం అనుసంధానం చేయాలని,ఒక చెరువు నిండిన తర్వాత మరొక చెరువుకు నీరు చేరే విధంగా వ్యవస్థను పునరుద్ధరించాలని సూచించారు.గ్రామస్థాయిలో వాటర్ రిసోర్స్ అధికారులు,ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ మరియు ఫీల్డ్ సిబ్బంది స్థానిక వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పెద్దలతో సమావేశాలు నిర్వహించి చెరువుల స్థితిగతులను తెలుసుకోవాలని తెలిపారు.గత సంవత్సరంలో చెరువుల నింపుదల స్థితి,పూర్తిగా నిండినవి,సగం నిండినవి,నీరు చేరని చెరువులపై పూర్తి సమాచారం సేకరించాలని ఆదేశించారు.ప్రత్యేకంగా నీరు చేరని చెరువులను ప్రాధాన్యతగా తీసుకుని కారణాలను గుర్తించాలని,వాగులు,కాలువలు పూడికతో నిండిపోవడం,ఆక్రమణలు,చెట్ల పెరుగుదల వంటి అంశాలను పరిశీలించి సమస్యలను గుర్తించాలన్నారు.నరేగా కార్మికులను వినియోగించి పూడికతీత పనులు,కాలువల శుభ్రత,చెట్ల తొలగింపు చేపట్టాలని,ఆక్రమణలపై రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే తొలగించాలని ఆదేశించారు.కొండల నుంచి వచ్చే నీరు చెరువులకు చేరేలా సహజ ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలని తెలిపారు.ఒక చెరువు నుంచి మరొక చెరువుకు నీరు చేరే సరఫరా కాలువల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలని,స్లూసులు,సర్ఫస్ వీర్లు లీకేజీలను గుర్తించి సరిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి,హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ విఠల్ ప్రసాద్,జిఎస్డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి,ఆర్డీవో శ్రీనివాస్,మండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు, డ్వామా ఏపీడీలు,ఇంజనీరింగ్,ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీలు

## - సిఐ టి.నరసింహులు







వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: పట్టణంలోనీ పలు ప్రాంతాల్లో వేంపల్లె సీఐ టి.నరసింహులు వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. శుక్రవారం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహన సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సిఐ మాట్లాడుతూ వాహనదారులకు, ప్రజలకు రహదారి బద్రత కల్పిస్తూ వివిధ చట్టాలు, రోడ్డు బద్రత నియమాలు, అక్రమ రవాణా, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు. ప్రజల బద్రతే పోలీసుల ఏకైక లక్ష్యమని సిఐ టి.నరసింహులు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్ పివి వ్యాక్సిన్ పై విధ్యార్థులకు అవగాహన

## - సామాజిక ఆరోగ్య అధికారి జీ.వెంకటరత్నం



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: హెచ్ పివి వ్యాక్సిన్ పై విధ్యార్థులకు అవగాహన కల్పించినట్లు సామాజిక ఆరోగ్య అధికారి జీ.వెంకటరత్నం అన్నారు. శుక్రవారం స్థానిక ఏపి మైనారిటీ గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణే లక్ష్యం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సర్వైకల్ క్యాన్సర్, ఇతర వైరల్ క్యాన్సర్లను నివారించే అత్యంత సురక్షితమైన హెచ్ పివి వ్యాక్సిన్ 9-14 ఏళ్ల బాలికలకు అత్యంత ప్రభావితంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ వ్యాక్సిన్ టీకా తీసుకోవడం ద్వారా వివిధ రకాల క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మించవచ్చని వెల్లడించారు.

# ఎం ఈ ఓ ఆఫీస్ ఎదుట ధర్నా ఎస్ఎఫ్ఐ



రైల్వేకోడూరు (ప్రజా సీమ) : రైల్వేకోడూరు ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా విక్టరీ ఫీచర్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ సీబీఎస్ఈ బోర్డును వేసుకొని అడ్మిషన్ చేస్తున్నారు అని ఎంఈఓ ఆఫీస్ ముందు శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ పిలుపు తేదీ:18/04/2026 సమయం: ఉదయం 10:00 గంటలకుప్రదేశం: ఎంఈఓ ఆఫీస్ ఎదురుగా, రైల్వే కోడూరు విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే ఇటువంటి సంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

# చట్టం ముందు అందరూ సమానులే

- చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తప్పవు
- వివక్షత లేని సమాజ నిర్మాణమే ఎస్సీ కమిషన్ లక్ష్యం
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు



పీలేరు (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వేంపల్లి గ్రామం నందు ఈనెల 12వ తేదీన చెన్నకేశవ స్వామి ఊరేగింపు కార్యక్రమంలో దళిత డప్పు కళాకారుల పైన రూరల్ ఎస్సై రామకృష్ణారెడ్డి దాడి జరిగిందని ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు అందడంతో ఈ కేసును సుమోటోగా తీసుకొని నేడు వేంపల్లి గ్రామంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ త్రీ మెన్ కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు, మేకల బిక్షం, పి గౌతం రాజ్ పర్యటించారు. అనంతరం సచివాలయంలో గ్రామస్తులను మరియు బాధితులైన డప్పు కళాకారులను విచారించి వారి నుంచి స్టేట్మెంట్ తీసుకొని అనంతరం రూరల్ సీఐ కళా వెంకటరమణ, ఎస్సై రామకృష్ణారెడ్డి లను విచారించారు అనంతరం త్రీ మెన్ ఎస్సీ కమిషన్ సభ్యులు శ్రీపతి బాబు , మేకల బిక్షం , పి .గౌతమ్ రాజ్ లు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన వేంపల్లి గ్రామం నందు చెన్నకేశవ స్వామి ఊరేగింపుకు గ్రామస్తుల పిలుపుమేరకు జాతరకు పొట్టకూటి కోసం దళిత డప్పు కళాకారులు విచ్చేసి డబ్బులు వాయిస్తుండగా ఈనెల 12వ తేదీ రాత్రి ఊరేగింపులో రెండు వర్గాల ప్రజలు ఆధిపత్య ప్రదర్శిస్తున్న వేళ మదనపల్లి రూరల్ ఎస్సై రామకృష్ణారెడ్డి పొట్టకూటి కోసం వచ్చిన దళిత డప్పు కళాకారుల పైన దాడి చేయడం చాలా హేమమైన చర్య అని వీరు అన్నారు. అసమానతలు కుల వివక్షరహిత, అట్రాసిటీ నివారణ కొరకు ఎస్సీ కమిషన్ పనిచేస్తుందని, చట్టం ముందు అందరూ సమానమేనని గ్రామంలో అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీ ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ,అధికారులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి ఎస్సీ, ఎస్టీలకు తోడ్పాటు అందించి రాజ్యాంగపలాలు అందేందుకు కృషి చేయాలని తెలియజేశారు. దళిత డప్పు కళాకారులపై దాడి జరిగిన సంఘటనపై విచారించిన నేపథ్యంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ గారికి నివేదిక అందజేస్తామని వీరు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, పసల చంద్రశేఖర్, రామకృష్ణ, ఆర్ ఐ బాల సుబ్రహ్మణ్యం, ఏ ఎస్ డబ్ల్యూ ఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వెంకటప్పను కలిసిన నాగునాయక్

- గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి



మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ సభ్యులు వెంకటప్ప శుక్రవారం మదనపల్లెలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ బి.నాగు నాయక్,జనరల్ సెక్రెటరీ బి.శంకర్ నాయక్,కమిటీ మెంబర్స్ ఘనంగా స్వాగతం వలికారు. గిరిజనులపైన జరుగుతున్న దాడులు,ఆర్థిక సమస్యలు,రోడ్లు సమస్యలు,భూ తగాదాలు గురించి ప్రస్తావించడం జరిగింది. అందుకు ఎస్టీ కమిషన్ సభ్యులు సకాలంలో స్పందించాలని కోరారు. మదనపల్లి నూతన జిల్లా ఏర్పడినందున గిరిజన భవనం కోసం 50 సెంట్లు భూమి కేటాయించడం జరిగింది. జిల్లా కొత్తగా ఏర్పడడం వల్ల ఇంకా 50 సెంట్లు భూమి అదనంగా కోరారు. కోటవారిపల్లితాండ రోడ్డు సమస్యను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అధికారులతో మాట్లాడి దాన్ని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు. సుగాలిమిట్ట నందు గుడి నిర్మాణం కొరకు ఎండోమెంట్ డిపార్ట్మెంట్ నుంచి త్వరగా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.కుమార్ నాయక్,బి.చిన్ని నాయక్ పాల్గొన్నారు.

# ఎంపిసీలో 464 మార్కులతో సత్తాచాటిన కీర్తి

- జనసైనికుడి ఇంట వికసించిన విద్యాకుసుమం
- ఘనంగా సన్మానించి దారం అనిత,రాయల్ గణి



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య కేంద్రమైన మదనపల్లి పట్టణానికి చెందిన జన సైనికుడు ఇంట విద్యా కుసుమం వికసించింది. తాజాగా ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన జనసేన నాయకులు చలపతి,మేరీ విజయలూసి దంపతుల కుమార్తె కీర్తి అద్భుత ప్రతిభ కనబరిచింది. పట్టణం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఎంపిసీ చదువుతున్న కీర్తి ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్లో 470 మార్కులకుగాను 464 మార్కులు సాధించి సత్తా చాటింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జనసేన పార్టీ రాయలసీమ కో-ఆర్డినేటర్ దారం అనిత,జనసేన జిల్లా నాయకులు రాయల్ గణిలు విద్యార్థిని కీర్తికి మిఠాయిలు తినిపించి శాలువాతోఘనంగాసన్మానించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూతల్లిదండ్రులు పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్నప్పటికీ,కష్టపడి కుమార్తెను చదివించడం గొప్ప విషయమని,అలాగే తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువులో ముందంజలో నిలవడం కీర్తి గొప్ప సాధనగా నిలిచిందని కొనియాడారు. కుటుంబ పరిస్థితులు ఎలాఉన్నా పట్టుదలఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని వారు వెల్లడించారు. భవిష్యత్తులో కీర్తిమరింత అద్భుతమైన ఫలితాలు సొంతంచేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాల ని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు దారం హరి,వెంకటేశ్వర్లు తదితరులు కీర్తిని అభినందించారు.

# ఇంటర్ ఫలితాలలో 988 మార్కులతో దీప్తిమై అద్వితీయ ప్రతిభ

- చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా సత్కారం



మదనపల్లె (ప్రజా సీమ) : బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పి.షణ్ముగం మనువరాలు దీప్తిమై ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం బైపీసీ గ్రూపులో 988 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ కనబరిచిందని ఆమె సాధించిన ఈ ప్రతిభ కుటుంబ సభ్యులతోపాటు విద్యాసంస్థకు,జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా దీప్తిమై చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ను ఆయన కార్యాలయంలో కలిసి ఆశీస్సులు పొందింది. కలెక్టర్ ఆమెను హృదయపూర్వకంగా అభినందించి,శాలువాతో సత్కరించారు. విద్యార్థి దశలోనే ఇటువంటి అత్యుత్తమ ఫలితాలు సాధించడం ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. దీప్తిమైతో కలెక్టర్ మాట్లాడుతూ సమయం ఎంతో విలువైందని,ఇంటర్మీడియట్లో చూపిన పట్టుదల,కష్టపడి చదివే అలవాటు ఉన్నత విద్యలో కూడా కొనసాగించాలి. మీ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని,అదే దిశగా కృషి చేస్తే భవిష్యత్తులో మీరు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు. అంతేకాకుండ కుటుంబానికి,చిత్తూరు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా చిత్తూరులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్న దీప్తిమై ఈ అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది. ఆమె విజయానికి అధ్యాపకులు,తల్లిదండ్రులు ముఖ్య కారణమని పేర్కొంటూ వారి సహకారం లేకుండా ఈ స్థాయి ఫలితాలు సాధ్యం కాదని తెలిపారు. దీప్తిమై సాధించిన ఈ ఘనతతో సహచర విద్యార్థులు,ఉపాధ్యాయులు,కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మెడికల్ రంగంలో ఉన్నత స్థానం సంపాదించాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది. ఈ విజయంతో మరిన్ని విద్యార్థులకు ఆమె ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ నా మనవరాలు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆమె మంచి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# మిట్స్ యూనివర్శిటీలో ఈఈఈ విభాగంచే టెరా-2కె26

- ముఖ్యఅతిథిగా హాజరైన ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీధర్





మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం వారు శుక్రవారం జాతీయస్థాయిలో టెక్నికల్ సింపోసియం టెరా-2కె26 కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 2006-2010 బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థి మరియు ఎక్సైజ్ శాఖలో సబ్ ఇన్స్పెక్టర్గా పనిచేస్తున్న ఎన్.శ్రీధర్ పాల్గొనగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ మరియు డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దీపాంకర్ రాయ్ లు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ విద్యార్థులను ఉద్యేశించి మాట్లాడుతూ కఠోర శ్రమ,క్రమశిక్షణ,పట్టుదలతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చునన్నారు. విద్యార్థులు నూతన ఆలోచనలతో ముందుకు సాగి పరిశ్రమలపై అవగాహన మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోర్సు ఎప్పటికీ ఎవర్గ్రీన్ అని,పవర్ జనరేషన్,ట్రాన్స్మిషన్ మరియు డిస్ట్రిబ్యూషన్ రంగాల్లో (విద్యుత్ ఉత్పత్తి మరియు సరఫరా సంస్థలు) మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే కేంద్ర మరియు రాష్ట్ర రంగాలలోని విద్యుత్ శాఖలు,రైల్వేలు,డిఫెన్స్,పబ్లిక్ సెక్టార్ అండర్టేకింగ్స్ (పీఎస్యు)లో కూడా ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. ప్రైవేట్ రంగంలో ఎలక్ట్రికల్ డిజైన్ ఇంజనీర్,మెయింటెనెన్స్ ఇంజనీర్,కంట్రోల్ సిస్టమ్స్ ఇంజనీర్,ఎంబెడెడ్ సిస్టమ్స్,ఆటోమేషన్ మరియు రోబోటిక్స్ వంటి విభాగాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. అదనంగా రిన్యూవబుల్ ఎనర్జీ (సోలార్, విండ్ పవర్),ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవి),స్మార్ట్ గ్రిడ్స్ వంటి ఆధునిక రంగాల్లో కూడా విస్తృతంగా అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ),ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి టెక్నాలజీలను నేర్చుకోవడం ద్వారా ఎలక్ట్రికల్ విద్యార్థులు మరింత మంచి కెరీర్ను నిర్మించుకోవచ్చునన్నారు. సరైన సాంకేతిక నైపుణ్యాలు,ప్రాక్టికల్ అనుభవం మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే దేశీయంగా మరియు అంతర్జాతీయంగా కూడా మంచి ఉద్యోగ అవకాశాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్ నాథన్,డీన్-స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దీపాంకర్ రాయ్,అసిస్టెంట్ డీన్ డాక్టర్ ఏ.వి.పవన్ కుమార్,విభాగాధిపతి డాక్టర్ మనవాళన్ గుణశేఖరన్,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ లో సమస్యల వెల్లువ





రాజంపేట,(ప్రజా సీమ) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం నాడు స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలపై నేరుగా చమర్తి జగన్ మోహన్ రాజు వినుతులను స్వీకరించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు,వెంటనే పరిష్కార దిశగా చర్యలు చేపట్టేందుకు ఈ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి,సంక్షేమాలను రెండు కళ్ళుగా భావించి సమన్వయంతో పాలన సాగిస్తున్నామని చమర్తి తెలియజేశారు. అంతకుముందు భూ సమస్యలు, వీటితో పాటు పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు,సామాజిక పెన్షన్లు,ఇండ్ల స్థలాలు, తాగునీటి ఇబ్బందులు తదితర అంశాలపై వినతులు అందాయన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య నాయుడు,సొసైటీ చైర్మన్ ములగూరు సుబ్రహ్మణ్యం నాయుడు,ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్,మార్కెట్ వైస్ చైర్మన్ చంగల్ రాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జీవీ సుబ్బరాజు,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీమ్,ఒంటిమిట్ట సీనియర్ నాయకులు ఎస్వి రమణ,మండల క్లస్టర్ ఇన్చార్జ్ దగ్గుబాటి వెంకటేశ్వర్లు నాయుడు, సీనియర్ నాయకులు దాసరి కళాధర్,పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## షాపులో కొన్న నెయ్యి ఒరిజనలా లేదా కల్తీదా? ఇలా చేస్తే ఈజీగా తెలిసిపోతుంది



మన భారతీయుల వంటగదుల్లో ఉండే అతిముఖ్యమైన పదార్థాలలో నెయ్యి ఒకటి. స్వచ్ఛత, సాంప్రదాయినికి చిహ్నంగా నెయ్యిని భావిస్తుంటారు. వంటల్లో మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక సంప్రదాయాలలో,పూజలు వంటి వాటికి నెయ్యిని వాడుతుంటారు. నెయ్యి చర్మ సౌందర్యానికి కూడా ఉపయోగించబడుతుంది. ఇక నెయ్యిని ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక రకాలుగా మేలు జరుగుతుంది. అనేక ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కూడా నెయ్యి మనల్ని కాపాడుతుంది. ఆయుర్వేదంలో కూడా నెయ్యికి ఓ ప్రత్యేక స్థానం ఉంటది. నీటితో కలపండి మీరు కొన్న నెయ్యి నిజంగా స్వచ్ఛమైనదేనా అని అనుమానంగా ఉంటే.. చిన్న గిన్నెలో కొద్దిగా షాపు నుంచి కొన్న నెయ్యి వేయండి. అందులోనే రెండు మూడు చుక్కల నీళ్లు వేయండి. కాసేపు తర్వాత ఆ నెయ్యి నీటిలో వెంటనే కలిసిపోకుండా విడిపోయినట్లుగా అనిపించినా లేదా నీటి చుక్కలు నెయ్యి పైన తేలుతూ ఉన్నట్లు కనిపించినా అది కల్తీ నెయ్యి అని అర్థం చేసుకోవచ్చు. ఇలా జరిగిందంటే ఆ నెయ్యిలో ఖచ్చితంగా ఇతర పదార్థాలు అంటే ఆయిల్ లేదా జంతువుల కొవ్వులు కలిపి ఉండవచ్చు. అదే స్వచ్ఛమైన నెయ్యి అయి ఉంటే అందులో నీరు కలిపినప్పుడు అది వేరుగా కాకుండా,నీటితో కలిసి ఒక మృదువైన మిశ్రమంగా తయారవుతుంది. అది నీటిలో కలిసినా కూడా తన సహజమైన రూపాన్ని నిలుపుకుంటుంది. ఈ చిన్న పరీక్షతో నెయ్యి నాణ్యతను నిర్ధారించుకోవచ్చు.

రంగు మంచి స్వచ్ఛమైన నెయ్యి ఎప్పుడూ లేత బంగారు పసుపు రంగులో ఉంటుంది. ఈ రంగు చూడటానికి చాలా ఆకర్షణీయంగా,ఫ్రెష్ గా అనిపిస్తుంది. ఒకవేళ మీరు కొన్న నెయ్యి సాధారణం కంటే ఎక్కువగా తెల్లగా ఉంటే అది స్వచ్ఛమైనది కాకపోవచ్చు. అలా ఉంటే అందులో పిండి పదార్థాలు,హానికరమైన రసాయనాలు లేదా జంతువుల కొవ్వులు కలిపి ఉండవచ్చు. నకిలీ నెయ్యికి.. అసలైన,మంచి నెయ్యికి ఉండే సహజమైన బంగారు రంగు ఉండదు. కాబట్టి నెయ్యి కొనేటప్పుడు దాని రంగును జాగ్రత్తగా పరిశీలించడం చాలా చాలా ముఖ్యం. రంగును బట్టి అది స్వచ్ఛమైనదా కాదా అని కొంతవరకు గుర్తించవచ్చు.

ఫ్రిడ్జ్ లో పెట్టండి మీరు కొన్న నెయ్యి స్వచ్ఛమైనదా కాదా అని మరొక టెస్ట్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఒక చిన్న గిన్నెలో కొద్దిగా నెయ్యి తీసుకొని దానిని కొన్ని గంటలపాటు మీ ఫ్రిజ్‌లో పెట్టేయండి. కాసేపయ్యాక చూడండి. స్వచ్ఛమైన నెయ్యి అయితే అది గట్టిగా మారిపోతుంది. అంతేకాదు మీరు దానిని తాకితే జిడ్డుగా అనిపించకుండా ఒక గట్టి వెన్నలా ఉంటుంది. ఎలాంటి జిడ్డు మరకలు కూడా ఉండవు. స్వచ్ఛమైన నెయ్యి తన సహజమైన రూపాన్ని నిలుపుకుంటుంది. ఒకవేళ ఆ నెయ్యి ఫ్రిజ్‌లో పెట్టిన తర్వాత కూడా పూర్తిగా గట్టిపడకుండా ద్రవంగానే ఉండినా, లేదా దాని చుట్టూ జిడ్డు జిడ్డుగా అనిపించినా అది కల్తీ నెయ్యి అయ్యే అవకాశం ఉంది. అలా ఉంటే, అందులో జంతువుల కొవ్వులు లేదా తక్కువ నాణ్యత కలిగిన చౌకైన ఆయిల్స్ వంటివి కలిపి ఉండవచ్చు. ఇటువంటి పదార్థాలు నెయ్యి సహజమైన గట్టిపడే స్వభావాన్ని మార్చేస్తాయి. కాబట్టి ఇకపై మీరు నెయ్యి కొన్నప్పుడు దాని స్వచ్ఛతను పరీక్షించడానికి ఈ ఫ్రిజ్ ట్రిక్‌ను తప్పకుండా ప్రయత్నించండి.

వాసన స్వచ్ఛమైన నెయ్యిని ప్యాకెట్ ఓపెన్ లేదా బాక్స్ మూత తీసినా మీ ముక్కుపుటాలను తాకే ఆ సువాసన అద్భుతంగా ఉంటుంది. అది పాల నుండి వచ్చిన సహజమైన కొవ్వుల ప్రత్యేకమైన వాసన. ఆ సువాసనలోనే నెయ్యి స్వచ్ఛత దాగి ఉంటుంది. ఒకవేళ మీరు కొన్న నెయ్యికి ఆ మధురమైన వాసన లేకపోతే లేదా అది పుల్లగా అనిపించినా లేదా మీకు ఏదో అసహ్యకరమైన వాసన వస్తున్నట్లు అనిపించినా జాగ్రత్త వహించండి. అలా ఉంటే ఆ నెయ్యిలో వేరే నూనెలు, హానికరమైన రసాయనాలులేదా దానిని ఎక్కువ కాలం నిల్వ ఉంచడానికి వాడే ప్రిజర్వేటివ్స్ కలిపి ఉండవచ్చు. ఇటువంటి కల్తీలు నెయ్యి సహజమైన సువాసనను పూర్తిగా మార్చివేస్తాయి. కాబట్టి నెయ్యి కొనేటప్పుడు దాని సువాసనను తప్పకుండా పరిశీలించండి.

## కోటీశ్వరులు కూడా కక్కుర్తి పడి తినే రెసిపి ఇదే..ఎలా చేయాలంటే

సీ ఫుడ్ ని ఇష్టపడేవాళ్లలో చాలామంది ఇష్టపడే వంటకం పీతల ఇగురు. దీని రుచి అమోఘం,అద్భుతం. మాటల్లో వర్ణించలేని టేస్ట్ దీనిది. పీత మాంసం తియ్యని రుచి, సుగంధ ద్రవ్యాల ఘాటు, చిక్కటి గ్రేవీ ఈ వంటకాన్ని ప్రత్యేకంగా నిలబెడతాయి. అన్నం, చపాతీతో ఇది తింటే చాలా బాగుంటుంది. కోటీశ్వరులు కూడా కక్కుర్తిపడి మరీ తినే పీతల ఇగురు ఇంట్లోనే ఎలా తయారుచేసుకోవాలి, దీని తయారీకి కావలసిన పదార్థాలు ఏంటో ఇక్కడ చూడండి.

పీతల ఇగురు తయారీకి కావలసిన పదార్థాలు పీతలు – 1 కేజీ చింతపండు రసం – 1/2 కప్పు నూనె – 4–5 టేబుల్ స్పూన్లు ఉప్పు – రుచికి తగినంత పసుపు – 1/2 టీ స్పూన్ కారం – 2–3 టీ స్పూన్లు ఉల్లిపాయలు – 2 పెద్దవి పచ్చిమిర్చి – 3–4 కొత్తిమీర – కొద్దిగా కరివేపాకు – కొద్దిగా అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టేబుల్ స్పూన్లు గరం మసాలా – 1 టీ స్పూన్ టమోటాలు – 2 మీడియం సైజు ధనియాల పొడి – 2 టీ స్పూన్లు జీలకర్ర పొడి – 1 టీ స్పూన్

పీతల ఇగురు తయారీ విధానం –ముందుగా ముందుగా పీతలను శుభ్రంగా కడిగి వాటి కాళ్లు, పెంకులను వేరు చేయండి. పెద్ద పీతలైతే వాటిని రెండు లేదా మూడు ముక్కలుగా కట్ చేసుకోండి.

–తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి ఆయిల్ వేడి చెయ్యాలి. నూనె వేడెక్కిన తర్వాత కరివేపాకు, పచ్చిమిర్చి,తరగిన ఉల్లిపాయలు వేసి అవి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. –తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు ఒక నిమిషం పాటు వేయించాక తరిగిన టమోటాలు వేసి మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. –ఇప్పుడు పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపండి. మసాలాలు నూనెలో కొద్దిసేపు వేగనివ్వండి. –ఇప్పుడు అందులో శుభ్రం చేసుకున్న పీతల ముక్కలు వేసి మసాలాలు



బాగా పట్టేలా కలపాలి. –ఇందులో రుచికి తగినంత ఉప్పు వేసి ఒకసారి కలపండి.

–తర్వాత చింతపండు రసం పోసి బాగా కలిపి మూత పెట్టేయాలి. 10–15 నిమిషాలు లేదా పీతలు పూర్తిగా ఉడికే వరకు మీడియం మంటమీద ఉడికించాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చవచ్చు. –గ్రేవీ చిక్కబడిన తర్వాత గరం మసాలా, తరిగిన కొత్తిమీర వేసి కలిపి ఒక నిమిషం ఉంచి స్టవ్ ఆఫ్ చేయండి. అంతే పీతల ఇగురు రెడీ. –వేడి వేడి పీతల ఇగురు అన్నం, రొట్టె లేదా చపాతీతో వడ్డించండి.

ఆరోగ్య ప్రయోజనాలు పీతలు రుచికరమైనవే కాకుండా అనేక పోషక విలువలను కలిగి ఉంటాయి.




పీతలు అధిక మొత్తంలో ప్రోటీన్‌ను కలిగి ఉంటాయి. ఇది కండరాల నిర్మాణం, మరమ్మత్తుకు చాలా అవసరం. ఒక కప్పు ఉడికించిన పీత మాంసంలో దాదాపు 24 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. పీతలలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా సంతృప్త కొవ్వు తక్కువగా ఉండటం వల్ల ఇది గుండె ఆరోగ్యానికి మంచిది. పీతలలో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రక్తపోటును తగ్గించడానికి, శరీరంలో మంటను తగ్గించడానికి సహాయపడతాయి.

## ఈ బోండా ముందు మైసూర్ బోండా ఏమాత్రం పని చేయదు..

### – నోట్లో వేస్తే బ్లాస్టే,ఎలా చేసుకోవాలో తెలుసా?



ఈ ఎండాకాలంలో పిల్లలకు స్కూల్స్ లేకపోవడం వలన వారు ఎప్పుడూ ఏదో ఒక స్నాక్ తినడానికి అడుగుతూనే ఉంటారు. లేకపోతే ఏదైనా చాకోలెట్, ఐస్ క్రీం వంటివి కోరుకుంటుంటారు. ఇవి ఆరోగ్యానికి హాని చేయడంతో పాటు ఎక్కువ డబ్బు కూడా ఖర్చు చేయిస్తాయి. అందుకే తల్లిదండ్రులు వారికి స్నాక్స్ చేసి ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటారు. అయితే ఇలాంటి సమయాల్లో రవ్వ బోండా ఒక అద్భుతమైన వంటకంగా చెప్పుకోవచ్చు. ఇది చాలా రుచికరంగా ఉంటుంది. టీ లేదా కాఫీతో కూడా ఈ బొండాను అద్దుకొని తినొచ్చు. ఈ బొండాను తయారు చేయడం కూడా చాలా సులభం. చిన్న చిన్న టిప్స్‌తో మరింత రుచికరంగా ఈ బొండాను మార్చుకోవచ్చు. ఈ స్టోరీలో ఈ రవ్వ బోండా ఎలా చేయాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది తెలుసుకుందాం రండి.

రవ్వ బొండా తయారీకి కావాల్సిన పదార్థాలు: ఉప్పు – రుచికి సరిపడా ఉప్మా రవ్వ – 2 కప్పులు మైదా – ¼ కప్పు బేకింగ్ సోడా – ¼ టీస్పూన్ ఉల్లిపాయలు – 2 పచ్చిమిరపకాయలు – 3 అల్లం – 1 చిన్న ముక్క కరివేపాకు – కొద్దిగా కొత్తిమీర తరుగు – 2 టీస్పూన్లు నీరు – తగినంత నూనె – వేయించడానికి బియ్యంపిండి – 2 స్పూన్లు పెరుగు – 1 కప్పు.

రవ్వ బొండా తయారీ విధానం: ఒక గిన్నెలో 2 కప్పులు ఉప్మా రవ్వ, 2 స్పూన్లు బియ్యంపిండి, ¼ కప్పు మైదా వేసి బాగా కలపండి. ఇందులో రుచికి సరిపడా ఉప్పు కూడా చేర్చండి. ఇప్పుడు ఆ పిండిని మొత్తాన్ని బాగా కలిపి పక్కన పెట్టుకోండి. ఇప్పుడు ఈ మిశ్రమంలో ఉల్లిపాయ తరుగు, పచ్చిమిరపకాయలు, అల్లం తరుగు, కరివేపాకు, కొత్తిమీర తరుగు జోడించండి. ఆ తరువాత వాటన్నిటినీ ఓసారి బాగా కలుపుకోండి. వీటిని వల్ల రవ్వ బొండా మరింత రుచికరంగా మారుతుంది.

ఇప్పుడు ఈ మిశ్రమంలో ¼ టీస్పూన్ బేకింగ్ సోడా వేసి బాగా కలపండి. ఇది బొండా బాగా ఉబ్బడానికి, పొరలు పొరలుగా రావడానికి సహాయపడుతుంది. అనంతరం ఈ మిశ్రమంలో 1 కప్పు పెరుగు, తగినంత నీరు వేసి బాగా కలిపి ఒక పేస్టు తయారుచేయండి. నీరులా కారకుండా కొంచెం గట్టిగా ఉండే విధంగా ఉండాలి. ఇప్పుడు స్టవ్‌పై ఒక గిన్నె పెట్టి, బోండాలు వేయించడానికి తగినంత నూనె వేడి చేయండి. నూనె క్రమంగా వేడి అయ్యాక, రవ్వ మిశ్రమాన్ని చిన్న బోండాలుగా బాగా చేసి, వేడి నూనెలో వేయించండి. బొండాలు బంగారు రంగులోకి మారినపుడు, వాటిని తీసుకుని ఒక పట్టికపై లేదా పేపర్ టవల్‌పై ఉంచాలి.

## సమ్మర్‌లో ఈ అట్లే తినాలి



మజ్జిగ చుక్క అట్లు తయారీకి కావలసిన పదార్థాలు –బియ్యం పిండి – 1 కప్పు –పుల్లటి మజ్జిగ – 1 1/2 కప్పులు –ఉల్లిపాయ – 1 చిన్నది –పచ్చిమిర్చి – 2–3 –అల్లం – 1/2 అంగుళం ముక్క –కొత్తిమీర – 2 టేబుల్ స్పూన్లు –జీలకర్ర – 1/2 టీస్పూన్ –ఉప్పు – రుచికి సరిపడా –నూనె లేదా నెయ్యి – అట్లు వేయించడానికి తగినంత.

మజ్జిగ చుక్క అట్లు తయారీ విధానం –ఒక పెద్ద గిన్నెలో బియ్యం పిండి వేయాలి. అందులో పుల్లటి మజ్జిగను కొద్ది కొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా బాగా కలపాలి. పిండి మజ్జిగలో పూర్తిగా కలిసిపోయి దోస పిండి కంటే కొంచెం పలుచగా ఉండేలా చూసుకోవాలి. –ఇప్పుడు సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, తురిమిన అల్లం, తరిగిన కొత్తిమీర, జీలకర్ర వేసి బాగా కలపాలి. –రుచికి సరిపడా ఉప్పు వేసి మరొకసారి బాగా కలపాలి. పిండిని కనీసం 15–20 నిమిషాల పాటు నాననివ్వాలి. ఇలా నానబెట్టడం వల్ల అట్లు మరింత మెత్తగా వస్తాయి. –స్టవ్ మీద ఒక నాన్–స్టిక్ పెనం లేదా సాధారణ పెనం ఉంచి వేడి చేయాలి. పెనం వేడెక్కిన తర్వాత కొద్దిగా నూనె లేదా నెయ్యి వేసి పెనం అంతా స్ప్రెడ్ చేయాలి. – ఒక గరిటెడు పిండిని తీసుకొని వేడెక్కిన పెనం మీద గుండ్రంగా పలుచగా పోయాలి. –అట్టు అంచులు కొంచెం ఎండినట్లుగా కనిపించినప్పుడు దానిపై కొద్దిగా నూనె లేదా నెయ్యి వేయాలి. –అట్టు ఒకవైపు బంగారు రంగులోకి వచ్చాక దానిని జాగ్రత్తగా తిప్పి రెండోవైపు కూడా కాల్చాలి. రెండు వైపులా బాగా కాలి బంగారు రంగులోకి వచ్చాక పెనం నుండి తీసి ప్లేట్‌లో పెట్టుకోవాలి. –ఇలాగే మిగిలిన పిండితో కూడా అట్లను వేసుకొని వేడి వేడిగా చట్నీ లేదా సాంబార్‌తో సర్వ్ చేయాలి. కొబ్బరి చట్నీ, టమాటో చట్నీ లేదా అల్లం చట్నీతో ఈ అట్లు చాలా రుచిగా ఉంటాయి.

# సినిమా న్యూస్







## సమంత కెరీర్ గ్రాఫ్.. గ్యాప్!

ఏ మాయ చేసావే అంటూ అడుగుపెట్టిన సమంత అనతి కాలంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగారు. కెరీర్ ఆరంభంలో అమ్మడి ప్రయాణం ఒక ప్రభంజనంలా సాగింది. మహేష్ , పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలందరి సరసన నటించి గోల్డెన్ లెగ్ గా పేరు తెచ్చుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ వరుస విజయాలు సాధిస్తూ సౌత్ ఇండియాలోనే అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయికలలో ఒకరిగా సత్తా చాటారు. ఆ సమయంలో ఆమె కెరీర్ గ్రాఫ్ నిరంతరం ఎదుగుతూనే ఉంది. అయితే వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు సమంత వృత్తిపరమైన వేగాన్ని ప్రభావితం చేసాయి అన్నది కాదనలేని నిజం. వివాహం తర్వాత కూడా ఆమె–రంగస్థలం–, మజిలీ, ఓ బేబీ వంటి చిత్రాలతో నటనలోని వైవిధ్యాన్ని నిరూపించుకున్నారు. కానీ వైవాహిక జీవితంలో విడిపోవడం, ఆ తర్వాతి కాలంలో ఎదురైన ఆరోగ్య సమస్యలు ఆమెను సినిమాలకు కొంతకాలం దూరం చేశాయి. మయోసైటిస్ వ్యాధి వల్ల శారీరకంగా, మానసిక సిద్ధంగా బలపడటానికి ఆమె కావాలనే సినిమాలకు సుదీర్ఘ విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత సమంత కేవలం వెండితెరకే పరిమితం కాకుండా డిజిటల్ మాధ్యమంపై దృష్టి సారించారు. ది ఫ్యామిలీ మ్యాన్ 2 సిరీస్‌తో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న అమ్మడు అటుపై తన కెరీర్ పంథాను మార్చుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథా బలమున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రాలను ఎంచుకోవడం మొదలుపెట్టారు. యశోద, శాకుంతలం వంటి ప్రయత్నాలు ఆ కోవలోకి చెందినవే అయినా అవి ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయాయి. గత మూడేళ్ల కాలంలో సమంత కెరీర్ గ్రాఫ్‌లో స్పష్టమైన గ్యాప్ కనిపిస్తోంది. ఆమె తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ ప్రారంభించి 'మా ఇంటి బంగారం' వంటి సినిమా ఇంకా షూటింగ్ దశలోనే ఉంది. ప్రస్తుతం సమంత ఎంపిక చేసిన ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. సమంత తన వ్యక్తిగత జీవితానికి, వృత్తికి మధ్య సమతుల్యత సాధించే క్రమంలోనే ఈ స్థాయిలో గ్యాప్ తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమె వ్యక్తిగత జీవితం మళ్లీ స్థిరపడినట్లు కనిపిస్తున్నా? సినీ కెరీర్ విషయంలో మాత్రం ఆమె ఇంకా పాత వైభవం కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఒకప్పుడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేసే స్థాయి నుండి ఇప్పుడు ఒక్క సినిమా విడుదల కోసం అభిమానులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సమంత సెకండ్ ఇన్నింగ్స్‌లో క్వాంటిటీ కంటే క్వాలిటీ కే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె నిర్ణయాలు చెబుతున్నాయి. సామా ఆరంభంలో కమర్షియల్ స్టార్‌గా వెలిగిపోయారు. కానీ నేడు ఒక పరిణతి చెందిన నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక మార్గాన్ని నిర్మించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ గ్యాప్ తర్వాత ఆమె చేసే సినిమాలు పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా ? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. కెరీర్ సెకండ్ హాఫ్‌లో ఆమె తీసుకోబోయే నిర్ణయాలే భవిష్యత్తులో ఆమె స్థానాన్ని డిసైడ్ చేస్తాయన్నది కాదనలేని నిజం.

## డెస్టినీ అంటే ఇదే.. సత్యదేవ్ గ్రేట్ అచీవ్‌మెంట్!

కొంత మంది ఎక్కడ పోగొట్టుకున్నారో అక్కడే రాబట్టుకుంటారు.. అదే డెస్టినీ అంటే. ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. అలాంటి అరుదైన సంఘటనే హీరో, టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ విషయంలోనూ జరిగిందట. అదే విషయాన్ని ఈ సందర్భంగా వెల్లడించి అందరిని షాక్‌కు గురి చేశాడు. సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మూవీ –రావ్ బహదూర్–. వెంకేటేష్ మహా దర్శకుడు. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై హీరో మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీపా థామస్ హీరోయిన్‌గా నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్న ఈ మూవీ ఫస్ట్ సింగిల్‌ని ఇటీవల విడుదల చేశారు. సినిమా రిలీజ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో తాజా నిర్వహించిన ప్రమోషనల్ ఈవెంట్‌లో హీరో సత్యదేవ్ ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించి ఆశ్చర్యపరిచారు. అంతే కాకుండా మహేష్ బాబుపై తనకున్న అభిమానానని ఈ సందర్భంగా చాటుకున్నాడు. ఓ అరుదైన సంఘటనని ఈ సందర్‌బంగా వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎస్.ఆర్. నగర్ ఎక్కువగా కాలేజీలు ఉండే ఏరియాలో ఓ సినిమా షూటింగ్ కోసం ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నాం. ఆ సన్నివేశాన్ని మహేష్ బాబు, నేను పాల్గొనగా చిత్రీరిస్తున్నారు. దీంతో చుట్టు పక్కల ట్రాఫిక్ జామ్ అయింది. స్టూడెంట్స్ ఎగ్జామ్స్ జరుగుతున్నా ఎగ్జామ్స్‌కు వెళ్లడం లేదు. అక్కడే ఉండి షూటింగ్ చూస్తున్నారు. కొంత మంది కిటికీల్లోంచి చూస్తూ కేకలు వేస్తున్నారు. ఆ సమయంలో మహేష్ నా భుజంపై చేయి వేసి డైలాగ్‌లు చెబుతున్నారు. ఇంతలో మా షూటింగ్ కారణంగా ట్రాఫిక్ జామ్ అయిందని తెలిసి ఓ పోలీస్ ఆయన వచ్చి షూటింగ్‌ని వాయిదా వేసుకోమన్నాడు. దాంతో నాకు సంబంధించిన వెర్షన్ పూర్తి కాకుండానే షూటింగ్ ఆగిపోయింది. దాంతో నా సీన్‌ని సినిమాలోంచి లేపేశారు. అప్పటికే ఊళ్లో వాళ్లందరికి నేను మహేష్ బాబుతో కలిసి నటించానని చెప్పుకున్నాను. సినిమాలో లేకపోయే సరికి ఫీలయ్యాను. అయితే అలా మిస్సయిన అవకాశం మళ్లీ ఈ సినిమాతో నన్ను వెతుక్కుంటూ రావడం డెస్టినీ అన్నారు సత్యదేవ్. మహేష్‌తో నటించిన సీన్ కట్ అయినా ఆయనే నా సినిమాకు సమర్పకులుగా వ్యవహరించడంతో నా డ్రీమ్ ఫుల్ ఫిల్ అయిందన్నారు. ఈ విషయం పక్కన పెడితే ప్రస్తుతం మహేష్ బాబు అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న –వారణాసి–లో నటిస్తున్నారు. జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న గ్లోబల్ మూవీగా అత్యంత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇరాన్ – ఇజ్రాయెల్ వార్ కారణంగా ఈ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతూ వస్తోంది. సౌదీ, దుబాయ్‌లలో కీలక సన్నివేశాలని షూట్ చేయాలని ప్లాన్ చేశారట. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆ షెడ్యూల్‌ని ఇండియాలోనే భారీ సెట్‌లలో పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.





## 'పెద్ది' వల్ల ఇంకా ఎన్ని ఎఫెక్ట్ కావాలి?

రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా రూపొందుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. సాధారణంగా సినిమా ఆలస్యం అవుతున్న కొద్ది అంచనాలు తగ్గుతాయి అంటారు. కానీ పెద్ది విషయంలో అది రివర్స్‌లో ఉంది. దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కోసం, స్క్రిప్ట్ వర్క్ కోసం దాదాపుగా ఏడాది టైం తీసుకున్నాడు. అయినా కూడా షూటింగ్ ఆలస్యం అయింది. పైగా రామ్ చరణ్‌కి గాయం, ఇతర వ్యక్తిగత విషయాల కారణంగా సినిమా ఆలస్యం అవుతూ వచ్చింది. షూటింగ్ దాదాపుగా పూర్తి అయినప్పటికీ వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో దర్శకుడు, యూనిట్ సభ్యులు ఎక్కడా రాజీ పడటం లేదట. అందుకే సినిమా విడుదల వాయిదా పడ్డా పర్వాలేదు కానీ క్వాలిటీ బెస్ట్‌గా ఉండాలని, ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ వండర్‌ను ఇవ్వాలనే పట్టుదలతో దర్శకుడు బుచ్చిబాబు ఉన్నాడని ఆయన సన్నిహితులు అంటున్నారు. ఈ ఏడాది మార్చిలో విడుదల చేయాలని భావించిన పెద్ది సినిమాను మొదటి సారి వాయిదా వేశారు. ఆ సమయంలో పవన్ కళ్యాణ్ సినిమాను విడుదల చేయడం జరిగింది. మార్చి చివరి వారంలో విడుదల కావాలి అనుకున్న సినిమాలు పెద్ది కారణంగా వాయిదా పడ్డాయి. కానీ పెద్ది వాయిదా పడ్డా కూడా ఆ సినిమాలను విడుదల చేయలేక పోయారు. మీడియం రేంజ్ హీరోల సినిమాలు కొన్ని పెద్ది సినిమాకు రెండు వారాల ముందు కానీ, రెండు వారాల తర్వాత కానీ రావాలి అనుకోవడంతో చాలా సినిమాలను వాయిదా వేయాల్సి వచ్చింది. ఇప్పుడు పెద్ది సినిమాను మరోసారి వాయిదా వేయడం జరిగింది. ఈసారి రెండు నెలల గ్యాప్ తీసుకోవాలని దర్శకుడు ప్లాన్ చేశాడు. దాంతో ఏప్రిల్ చివర్లో రావాలి అనుకున్న సినిమాలన్నీ పెద్ది కారణంగా వాయిదా పడ్డాయి. వాటి వర్క్‌ను మెల్లగా నడిపిస్తున్నారు. ఇప్పుడు పెద్ది వాయిదా పడ్డ అవి వచ్చే పరిస్థితి లేదు. పెద్ది సినిమాను ఈనెల 30న విడుదల చేయాలని నిర్ణయించారు. కానీ పరిస్థితులు అనుకూలించని కారణంగా వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కొత్త తేదీని దర్శకుడు, నిర్మాతలు ప్రకటించలేదు.



## రేణూ బ్రెయిన్‌లో లాంగ్వేజ్ మిక్సీ

రేణూ బ్రెయిన్‌లో లాంగ్వేజ్ మిక్సీతెలుగు సినీ పరిశ్రమలో తనదైన గుర్తింపును సంపాదించుకున్న రేణు దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా భాషల మేళవింపుతో కూడిన తన పెరుగుదల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆమె తల్లి రాజస్థానీ, తండ్రి గుజరాతీ కావడంతో కుటుంబంలో భిన్న సంస్కృతుల సమ్మేళనం కనిపించేదని తెలిపారు. అయితే, ఇద్దరికీ ఒకరి భాష మరొకరికి రాకపోవడంతో వారు హిందీలో సంభాషించుకునేవారని చెప్పారు. అదే సమయంలో ఇంట్లో పిల్లలతో మాట్లాడేటప్పుడు మాత్రం మరాఠీనే ఉపయోగించేవారని ఆమె గుర్తుచేసుకున్నారు. పూణేలో పుట్టి పెరిగిన రేణు దేశాయ్, తనను తాను మహారాష్ట్ర అమ్మాయిగా భావిస్తానని చెప్పడం గమనార్హం. ఈ బహుభాషా వాతావరణం తన వ్యక్తిత్వాన్ని ఎంతగానో ప్రభావితం చేసిందని, తన ఆలోచనల్లోనే భాషల మిక్సింగ్ సహజంగా జరుగుతుందని ఆమె వివరించారు. ఈ భాషా మేళవింపే తనకు ఒక ప్రత్యేకతగా మారిందని రేణు అభిప్రాయపడ్డారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు, మరాఠీ, మార్వాడీ.. ఈ ఐదు భాషల్లో తాను సులభంగా మాట్లాడగలగడం తనకు ఒక అదనపు బలం అని పేర్కొన్నారు. అయితే, ఏ సందర్భంలో ఏ భాష మాట్లాడాలో నిర్ణయించుకోవడం కొన్నిసార్లు తనకు సవాలుగా మారుతుందని ఆమె సరదాగా చెప్పారు. ఈ అనుభవం తన వ్యక్తిగత జీవితంతో పాటు తన నటనా ప్రయాణంలో కూడా ప్రభావం చూపిందని చెప్పవచ్చు. ముఖ్యంగా భిన్న ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ కావడంలో ఈ బహుభాషా పరిజ్ఞానం తనకు ఉపయోగపడిందని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma